ప్రజాశక్తి
శుక్రవారం 3 ఫిబ్రవరి 2023
5
విజయనగరం



దేవాదాయశాఖ కమిషనర్‌తో కోలగట్ల భేటీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దేవాదాయ శాఖ కమిషనర్ హరి జవహర్‌లాల్‌తో గొల్లపూడిలోని కమిషనర్ కార్యాలయంలో గురువారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి భేటీ అయ్యారు. పైడితల్లమ్మ ఆలయ అభివృద్ధి, నిధుల మంజూరుపై చర్చించారు. నూతన భవన నిర్మాణంలో అన్నదాన మండపం, హోమశాల, క్యూ కాంప్లెక్స్ తదితర ఆలయ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా తగు చర్యలు చేపట్టాలని కోలగట్ల.. కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి సభ్యులు ఎంకెబి పాల్గొన్నారు.



దేవాదాయ శాఖ కమిషనర్‌తో సమావేశమైన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

కెజిబివిల్లో సూపర్ 60

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నడుస్తున్న కెజిబివి విద్యార్థులు ఈ ఏడాది నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో 26 కెజిబివిలు ఉన్నాయి. వీటిలో మొత్తం 6917 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు 1052 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. డిసెంబర్ నెలాఖరు నాటికి సిలబస్ పూర్తి చేసి రివిజన్ పార్టులో ఉన్నారు. గత ఏడాది సప్లిమెంటరీతో కలిపి 95శాతం ఫలితాలు నమోదు కాగా ఈ ఏడాది 100 శాతం ఫలితాలు నమోదు లక్ష్యంగా ఆ శాఖ అధికారులు కదులుతున్నారు.



ప్రత్యేక తరగతుల్లో చదువుతున్న విద్యార్థినులు

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థుల సన్నద్ధత

మూడు విద్యాలయాలు.. 130 మంది విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కెజిబివిల్లో పదో తరగతి ఫలితాలను మెరుగుపర్చేందుకు గత ఏడాది ప్రయోగాత్మకంగా సూపర్ 60 ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమం సత్ఫలితాలిచ్చింది. ఇందులో భాగంగా గత ఏడాది జామి, విజయనగరం కెజిబివిల్లో 120 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. 95 శాతం ఫలితాలు రావడంతో ఈ ఏడాది ఆ రెండు పాఠశాలలతోపాటు బొబ్బిలి కెజిబివిలో కూడా అమలు చేస్తున్నారు. సూపర్ 60లో భాగంగా పాఠశాలల్లో రోజు వారి పరీక్షలు నిర్వహిస్తున్నారు.మరోవైపు ప్రభుత్వ హైస్కూళ్ల నుంచి సబ్జెక్ట్ నిపుణులను డెప్యుటేషన్ వేసి పిల్లలను సన్నద్ధం చేస్తున్నారు. విద్యార్థులు చదువుకునేందుకు అనువుగా ఉండేలా రీడింగ్ చైర్స్, ప్లాంక్‌లు వారం రోజులు క్రితం అధికారులు అందించారు.

అన్ని కెజిబివిల్లోనూ సూపర్ 60 అమలు

సూపర్ 60 పాఠలల్లో విద్యార్థులను ఎలా అయితే పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారో అదే విధంగా అన్ని కెజిబివిల్లోను ఆ విధానాన్ని అమలు చేస్తున్నారు. రోజూ వారి పరీక్షలతో పాటు, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రతి ఇద్దరు విద్యార్థులను ఒక ఉపాధ్యాయినికి దత్తత ఇచ్చి వారిని చదివించే బాధ్యత, పర్యవేక్షణ అప్పగించారు. ప్రతి రోజు ఉదయం 5గంటల నుంచి రాత్రి 10.30గంటల వరకు చదివించడం, అనుమానాలు నివత్తి చేస్తున్నారు.

ముగ్గురు కోఆర్డినేటర్లు

పదో తరగతి పరీక్షల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ముగ్గురు కో ఆర్డినేటర్‌లను విద్యాశాఖ నియమించి ంది. వారు ముగ్గురూ ప్రతిరోజు ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్ట్ టీచర్స్‌తో మాట్లాడటం, ఏ రోజుకారోజు ఏమి చేశారు, పరీక్ష, విద్యార్థుల ప్రగతి గురించి తెలుసుకొని పర్యవేక్షణ చేస్తున్నారు.

ప్రథమ శ్రేణి ఉత్తీర్ణతే లక్ష్యం

పదో తరగతి పరీక్షలు రాస్తున్న 1052 మంది విద్యార్థులూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యేలా కృషి చేస్తున్నాం. గత ఏడాది 30 ఐఐఐటి సీట్లు కెజిబివి విద్యార్థులు సాధించారు. ఈ ఏడాది ఆ సంఖ్యను పెంచడమే లక్ష్యంగా చదివిస్తున్నాం. 100శాతం ఫలితాలు రాబట్టడంతో పాటు, అందరినీ మొదటి తరగతిలో ఉత్తీర్ణులు చేయడమే లక్ష్యంగా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం. విద్యార్థులకు పౌష్టికాహారం అందించి మానసికంగా సిద్ధం చేస్తున్నాం.



\- వి.స్వామినాయుడు, ఎపిసి, సమగ్ర శిక్ష

ఇంకెన్నాళ్లో.. ఇలా?

'ధాన్యం కొనుగోలులో మిల్లర్ల పాత్ర తీసేస్తున్నాం. రైతు పండించిన ప్రతి గింజా ప్రభుత్వమే కొంటుంది' అంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించినప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తయిందని, మళ్లీ ధాన్యం కొనుగోలు కోసం లక్ష్యం ఎంతో ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాక సేకరణ చేపడతామని అధికారులు చెబుతున్నారు. దీంతో 15 రోజులుగా వరి నూర్పులు చేపట్టిన రైతులు ధాన్యం బస్తాలు కళ్లాల్లో నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కళ్లంలో ఉన్న ధాన్యం బస్తాలు

- కొనుగోలు లేక కళ్లాల్లో నిలిచిపోయిన ధాన్యం
- రైతుల కళ్లలో దైన్యం

ప్రజాశక్తి-దత్తిరాజేరు

ఈ ఖరీఫ్ సీజన్లో జిల్లాలో సుమారు మూడు లక్షల 50 వేలు మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల పండిస్తే.. అందులో మూడు లక్షల టన్నులు కొంటామని పౌర సరఫరాల సంస్థ ప్రకటించింది. చివరికి ఆ లక్ష్యాన్ని 2.64 లక్షల మెట్రిక్ టన్నులకు కుదించేశారు. దీంతో సంక్రాంతి నాటికి ప్రభుత్వ లక్ష్యం పూర్తి కావడంతో కొనుగోలు నిలిపివేశారు. కానీ పొలాల్లో ఎక్కడ చూసినా ధాన్యం బస్తాలు నెట్టులు వేసి ఉన్నాయి. కొన్నిచోట్ల వరి కుప్పలు కనిపిస్తుంటే అధికారులు మాత్రం 75 శాతం కొనుగోలు చేపట్టామని చెబుతున్నారు. రకరకాల కారణాలు చూపి కొనుగోలు నిలిపివేశారు. జిల్లాలో అనేక మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. పండగ ముందు చాలా రైతులు వరినూర్పులు చేపట్టి మిల్లులకు తరలించేందుకు సిద్ధమైన వేళ మిల్లులు మూసివేశారు. తీరా పండగ కదా! అనుకున్న రైతులు.. పండగ పూర్తయి 15 రోజులు కావస్తున్నప్పటికీ సర్వర్ సమస్య అంటూ ఆర్‌బికె సిబ్బంది సమాధానం దాటవేశారు. దత్తిరాజేరు మండలంలో 1500 మంది రైతుల నుంచి 7,800 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది.

ఇదే అదునుగా దళారులు

లక్ష్యం పెంచి రైతుల వద్ద ధాన్యం పూర్తిగా కొనుగోలు చేస్తే ఫర్వాలేదు. కాని, ఇదే అదునుగా దళారులు ఇష్టానుసారంగా కొనుగోలు చేస్తే రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అయితే ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడం వల్లే అటు అధికారులు, ఇటు మిల్లర్లు కొనుగోలు చేపట్టడం లేదని తెలుస్తోంది. కొత్తగా అదనపు సేకరణ లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తామని ఉన్నతాధికారులు ప్రకటించినా, మండల స్థాయికి ఇంకా అనుమతులు రాలేదు. దీంతో ఎక్కడి ధాన్యం అక్కడ కళ్లాల్లో నెట్టులు వేసి ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారుల స్పందించి త్వరగా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు జమ కాని ఖర్చులు

రైతులు ధాన్యం మిల్లులకు తరలించేందుకు అయ్యే ఖర్చుల్లో గన్ని బ్యాగులు, ట్రాక్టర్లకు ఎక్కించేందుకు హమాలీలు, మిల్లులకు ట్రాన్స్‌పోర్టు ఖర్చు ప్రభుత్వ భరిస్తుందని అధికారులు ప్రకటించింది. అందుకు కొంత ధర నిర్ణయించినప్పటికీ ఇంతవరకు చాలా మంది రైతులకు వారి ఖాతాలో ఆ ఖర్చులు జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్పందన ఇకపై 'జగనన్నకు చెబుదాం'గా మార్పు

ప్రజాశక్తి-విజయనగరం

స్పందన కార్యక్రమం ఇకపై 'జగనన్నకు చెపుదాం'గా మార్పు జరిగిందని డిఆర్ఒ ఎం.గణపతిరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి పర్యవేక్షిస్తారని తెలిపారు. స్పందన లాగిన్‌లో వచ్చిన వినతులను ఆయా శాఖల అధికారులు 24 గంటల్లో ఓపెన్ చేసి చూడాలని, అలా చూడని వారి పై క్రమశిక్షణా రాహిత్యంగా పరిగణించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గురువారం తన ఛాంబర్‌లో స్పందన ఆడిట్ టీమ్‌తో సమావేశం నిర్వహించారు. అధికారులు స్పందన లాగిన్ లో వచ్చిన దరఖాస్తు తన పరిధిలో ఉంటే ఎస్ అని క్లిక్ చేసి ఎంక్వయిరీ అధికారికి పంపాలని , తన పరిధిలో కానిదైతే నో క్లిక్ చేసి స్పందన టెక్నికల్ టీమ్‌కు ఆన్‌లైన్ లో పంపాలని తెలిపారు. సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ డాక్టర్ అశోక్ కుమార్, సిపిఒ బాలాజీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ గణపతిరావు



ధర్నా చేస్తున్న వ్యకాస నాయకులు, కూలీలు

మేట్ల నియామకం ప్రజాస్వామికంగా చేపట్టాలి

వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని • కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సంతపాలెంలో ఉపాధి హామీ మేట్లను ప్రజాస్వామికంగా నియామకం చేయాలని, పని చేసిన వారికి అవకాశం ఇవ్వాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, అధ్యక్షప్రధాన కార్యదర్శులు గాడి అప్పారావు, జి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంతపాలెం గ్రామ ఉపాధి కూలీలు గతంలో 175 కుటుంబాలకుగాను 18 మంది మేట్లు ఉండేవారని, ప్రస్తుత ప్రభుత్వ నిబంధనలవల్ల 50 మందికి ఒక మేటు చొప్పున నియామకం చేస్తున్నారని తెలిపారు. కనీసం 20 రోజులు కూడా పని చేయని వారిని నియమించారని తెలిపారు. ఇది నిబంధనలను ఉల్లంఘించడమేనన్నారు. కూలీల అభీష్టం మేరకు ప్రజాస్యామ్యయుతంగా నియమించకుండా ఇష్టారాజ్యంగా నియమించారని విమర్శించారు. పోలీసుల పహారాతో ఉపాధి పనులు జరుగుతున్నా యంటే పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉందో అర్ధమవుతుందన్నారు. కూలీలు పనిచేసుకోనేందుకు సరైన వాతావరణం, సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. కూలీలకు అందుబాటులో ఉన్న మేట్లను నియమించే చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం ఉపాధి హామీ ఎఒ బివి సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఆయన పీడీతో మాట్లాడడంతో శనివారం వచ్చి సమస్యను పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చొప్ప శివాజీ, వెలగల నాగలక్ష్మి, డి. ఈశ్వరమ్మ, జి.వరలక్ష్మి, రావాడ సత్యవతి, వెలగల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముహూర్తానికి ముందుగానే ఇళ్లు

- జగనన్న ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై సమీక్షించిన జెడ్‌పి చైర్మన్ మజ్జి
- ఉగాదికి శతశాతం లక్ష్యాలను చేరుకోవాలని అధికారులకు ఆదేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి, సామూహిక గృహ ప్రవేశాల కోసం నిర్ణయించిన ముహూర్తం కంటే ముందుగానే అందుబాటులోకి తేవాలని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు.. సంబంధిత విభాగాల అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఉగాదికి శతశాతం నిర్మాణాలను పూర్తి చేసి లక్ష్యాలను చేరుకోవాలని నిర్దేశించారు. జగనన్న కాలనీల్లో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై ఆయన గురువారం జెడ్‌పి సమావేశ మందిరంలో విజయనగరం, చీపురుపల్లి, బొబ్బిలి రెవెన్యూ డివిజన్ల వారీగా సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంజూరైన ఇళ్లు.. ఇప్పటి వరకు చేరుకున్న లక్ష్యాల గురించి ఒక్కో మండలం నుంచి అధికారులను, సిబ్బందిని ఆరా తీశారు. ఆయా మండలాల పరిధిలో క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎల్‌పిసిలు, మోటార్లు, ఇసుక కొరత, నీటి వసతి తదితర సమస్యలను ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వివిధ విభాగాల ఎఇలు జెడ్‌పి చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. ఎల్‌పిసిల గురించి అక్కడికక్కడే ఆయా మండలాల తహశీల్దార్లతో ఛైర్మన్ ఫోన్లో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. నీటి వసతి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇని ఆదేశించారు. విద్యుత్ లైన్ల మార్పు, కొత్త లైన్ల ఏర్పాటు, అప్రోచ్ రోడ్ల నిర్మాణం తదితర పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆయా విభాగాల అధికారులకు సూచించారు. గుంకలాం లేఅవుట్‌కు సమీపంలో ఉన్న శ్మశానవాటిక వల్ల నిర్మాణాలపై ప్రభావం పడుతుందని ఇంజినీరింగ్ అసిస్టెంట్ చెప్పగా.. తగిన చర్యలు తీసుకోవాలని చైర్మన్.. డిపిఒను ఆదేశించారు.

వంగర ఇంజినీరింగ్ అసిస్టెంట్ల గైర్హాజరుపై అసంతృప్తి

రాజాం నియోజకవర్గ పరిధిలోని వంగర నుంచి ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమీక్షా సమావేశానికి హాజరు కాకపోవడంపై జెడ్‌పి చైర్మన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సమాచారం అందజేయడంలో విఫలమైన గృహ నిర్మాణ శాఖ ఎఇపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ల గైర్హాజరుకు కారణం తెలుపుతూ నివేదిక తెప్పించాలని గృహ నిర్మాణ శాఖ పీడీని ఆదేశించారు.

సానుకూల దృక్పథంతో లబ్ధిదారులకు సహకరించాలి

చిన్నచిన్న సాంకేతిక సమస్యల కారణంగా కొన్ని చోట్ల పనుల్లో జాప్యం జరుగుతోందని, ఇలాంటి సందర్భంలో అర్హతను ప్రామాణికంగా తీసుకొని లబ్ధిదారులకు సహకరించాలని అధికారులను, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను జెడ్‌పి చైర్మన్ ఆదేశించారు. వీలైనంత మేరకు లబ్ధిదారులకు ప్రోత్సాహం అందించాలనే గానీ నిరుత్సాహ పరచకూడదని హితవు పలికారు.

సమావేశంలో జెడ్‌పి సిఇఒ అశోక్ కుమార్, గృహనిర్మాణ శాఖ పీడీ రమణమూర్తి, ఇపిడిసిఎల్ ఎస్ఇ నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమాశంకర్, డిపిఒ నిర్మలాదేవి, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు ప్రత్యేక హోదా సాధన సమరయాత్ర


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాలు చేపట్టిన సమరయాత్ర శుక్రవారం జిల్లాకు రానుందని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి నాయకులు తెలిపారు. గురువారం అమర్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్ రావు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషన్, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.సతీష్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి.రాజేష్, పిడిఎస్‌యు నాయకులు కె.సాయికిరణ్ మాట్లాడారు. జనవరి 20 నుంచి ఫిబ్రవరి 4 వరకు హిందూపూర్ నుంచి ఇచ్చాపురం వరకూ ఈ సమరయాత్ర జరుగుతుందన్నారు, జిల్లాకు రానున్న ఈ యాత్రను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలని, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, కేంద్రీయ గిరిజన, సెంట్రల్, మైనింగ్ యూనివర్శిటీల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని, జిల్లాలో మూతబడిన జ్యూట్,ఫెర్రోయిల్లాస్ పరిశ్రమలు తెరిపించాలని, పెండింగ్ లో ఉన్న నీటి ప్రాజెక్టులను పూర్తిచేయాలని, సుజల స్రవంతి నీటి ప్రాజెక్టులను పూర్తిచేసి,వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలని, పోలవరం ప్రాజెక్టు నిర్మించాలని, యువతకుఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ ఈ సమరయాత్ర సాగుతోందన్నారు. విద్యార్థులు,యువజనులు పాల్గొని ఐక్యంగా ఉద్యమించి మన హక్కులను సాధించుకోవాలని పిలుపిచ్చారు. కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సునీల్, ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ ఎం.సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా పంపిణీ'లో లోపాలు సరిదిద్దాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జిల్లాలో రేషన్ సరుకుల పంపిణీలో లోపాలను సరిదిద్దాల్సిందిగా పౌరసరఫరాల అధికారులకు సూచించామని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు పేర్కొన్నారు. జిల్లా పర్యటనలో రెండో రోజు గురువారం నెల్లిమర్ల మండలంలో ఆయన పర్యటించారు. కొత్తపేటలో పలు చోట్ల రేషన్ పంపిణీని, సువ్వాడపేటలో అంగన్‌వాడీ కేంద్రాన్ని, నెల్లిమర్లలో కెజిబివిని పరిశీలించారు. మండల స్థాయి స్టాక్ పాయింట్ నుంచి రేషన్‌ను ఎండియుకు, గ్రామస్థాయిలోని రేషన్ డిపో స్టాక్ పాయింట్‌కు నిత్యావసర సరుకులు డెలివరీ చేసిన తర్వాత ఆ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయని విషయాన్ని కమిషన్ సభ్యులు కాంతారావు గమనించారు. ఇకపై స్టాకు పంపిన వెంటనే ఆన్‌లైనులో ఆ సమాచారం నమోదు చేయాలని, లేకుంటే కఠిన చర్యలకు సిఫార్సు చేస్తానని హెచ్చరించారు. గ్రామస్థాయి రేషన్ స్టాక్ పాయింట్ల వద్ద రేషన్ సరుకులను ఏ పథకం కింద ఇస్తున్నారో వివరాలు తెలియజేసే బ్యానర్లు ప్రదర్శించాలని ఆదేశించారు. ఎండియుల ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నప్పుడు వాహనంలో పోసి ఉంచకుండా బస్తాల్లోనే ఉంచాలన్నారు. బస్తాలలో ఉంచే తూకం వేయాలని స్పష్టం చేశారు. బియ్యం బయట పోసి ఉంచడం నిబంధనలకు విరుద్ధమని, ఆవిధంగా చేసేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సువ్వాడపేట అంగన్‌వాడీ కేంద్రం సందర్శించి రిజిష్టర్లను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు సకాలంలో ఆహారాన్ని అందజేయాలని కార్యకర్తను ఆదేశించారు. నెల్లిమర్ల కెజిబివిలో విద్యార్థినులకు అందిస్తున్న ఆహార నాణ్యతను ఫుడ్ సేఫ్టీ అధికారితో కలిసి పరిశీలించారు. ఆహారంలో నాణ్యతా లోపం ఉన్నట్టు గుర్తించి విద్యాలయ నిర్వాహకులను హెచ్చరించారు.



బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న ఆహార కమిషన్ సభ్యులు కాంతారావు



నిరసన చేపడుతున్న సిఐటియు, రైతుసంఘం నాయకులు, కూలీలు

ప్రజావ్యతిరేక బడ్జెట్‌పై నిరసన

ప్రజాశక్తి-రామభద్రపురం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ గ్రామీణ వ్యవస్థను నిర్వీర్య పరిచేలా ఉందని సిఐటియు ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి బి.శ్రీను మాట్లాడుతూ వ్యవసాయానికి కోతలు, ఉపాధి హామీకి ఎసరు పెట్టి గ్రామాల్లో రైతులు, కూలీలకు తీవ్రంగా నష్టం చేసే విధంగా కేంద్ర బడ్జెట్ ఉందన్నారు. దీనికి వ్యతిరేకంగా రైతులు, వ్యవసాయ కార్మికులు ఐక్యంగా పోరాటాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం నాయకులు ధర్మారావు, ఆదినారాయణ, దివ్య, శ్రీదేవి, ఉపాధి హామీ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : కార్మిక, కర్షకులకు వ్యతిరేకంగా కేంద్ర బడ్జెట్ ఉందని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు అన్నారు. గురువారం స్థానిక జ్యూట్‌మిల్లు గేటు వద్ద గేటు మీటింగ్ నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లోఉపాధి హామీ నిధులు, ఎరువుల సబ్సిడీకి కోత విధించారని చెప్పారు. కార్మిక వర్గానికి రావాల్సిన డిఎ బకాయిలు బడ్జెట్‌లో లేకపోవడం దారుణమన్నారు.

ప్రజా మరుగుదొడ్ల పరిశీలన


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో లంకాపట్నం, గాజులరేగ ప్రాంతాలలో ప్రజామరుగుదొడ్లు, మురికివాడలను కమిషనర్, హెల్త్ ఆఫీసర్లు గురువారం పరిశీలించారు. సంబంధిత టాయిలెట్ నిర్వహణ గురించి ఆరా తీశారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. లంకపట్నం పరిధిలో విపరీతంగా ఉన్న కాలువ అతిక్రమణలు వెంటనే సిబ్బందిని పెట్టి నిర్మూలించాలని ఆదేశించారు. స్థానికులు ప్రస్తావించిన మంచినీటి సమస్యపై సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారితో మాట్లాడి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్‌తో పాటు శానిటరీ ఇనెస్పెక్టర్‌లు, ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నేహాకు మేజర్ భానుచందర్ స్మారక పురస్కారం

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్రపతి శౌర్య పతాక గ్రహీత మేజర్ నారాయణం భానుచందర్ వర్ధంతి సందర్భంగా సీతమ్ విద్యార్థిని కుమారి అన్న నేహా థామస్‌ను ఘనంగా సత్కరించారు. సీతం కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భానుచందర్ జ్ఞాపకార్థం రక్షణ శాఖ సెక్రటరీ కమెండేషన్ బహుమతి గ్రహీత, ఎన్‌సిసిలో విశేష ప్రతిభ , నాట్యంలో నైపుణ్యం కలిగిన కుమారి అన్న నేహా థామస్ కు మేజర్ భాను చందర్ నారాయణం పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీతమ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శశి భూషణ్ రావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి.రామ్మూర్తి, లెఫ్టినెంట్ ఎం.వరలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



నేహా థామస్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న మజ్జి కృష్ణారావు

ధాన్యం కొనుగోలు చేయాలి

టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి-గరివిడి

రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చెయ్యాలని టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున డిమాండ్ చేశారు. గురువారం రేగటి, విజయరామపురం గ్రామాల్లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ధాన్యం మొత్తం కొనుగోలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆయన వద్ద మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ జిల్లాలో రైతుల పండించిన మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉన్నతాధికారులు గ్రామాల్లో పర్యటించి ధాన్యం కొనుగోలు సక్రమంగా జరిగేటట్టు చూడాలన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ కు తీవ్ర అన్యాయం చేసినప్పటికీ వైసిపి నాయకులు స్వాగతించడం బాధాకరమన్నారు. విశాఖ రైల్వే డివిజన్ ఏర్పాటు ప్రస్థానం లేకపోవటం విచారకరమన్నారు. కార్యక్రమంలో పైల బలరాం, సారేపాక సురేష్ బాబు,మహంతి రమణమూర్తి, వెంపడాపు రమణమూర్తి, మీసాల రాము, తదితరులు పాల్గొన్నారు.



'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న టిడిపి నాయకులు

రైతు పేరెత్తే అర్హత వైసిపికి లేదు

బొబ్బిలి : రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, రైతు అనే పదాన్ని ఉచ్ఛరించే అర్హత వైసిపికి లేదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అన్నారు. కోటలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న వైసిపి.. ధాన్యం కొనుగోలులో పూర్తిగా విఫలమైందన్నారు. ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నేటికీ కళ్లాల్లో ధాన్యం బస్తాలు దర్శనమిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



డిపో వద్ద ధర్నా చేస్తున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు, కార్మికులు

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం

ప్రజాశక్తి - విజయనగరం కోట

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాడతామని ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బి.రాములు, విజయనగరం డిపో కార్యదర్శి ఎం.చంద్రయ్య, డిపో ప్రెసిడెంట్ సిహెచ్.వి రావు అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో వర్క్ షాప్ ఎదుర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఇప్పటివరకు కండక్టర్, డ్రైవర్ నైట్ డ్యూటీ అలవెన్సు ఆరు నెలల నుంచి రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.



రక్తదాతను అభినందిస్తున్న డిపిటిఒ శ్రీనివాసరావు

రక్తదాతలే ప్రాణ దాతలు

ప్రజాశక్తి- విజయనగరం కోట

రక్త దాతలే ప్రాణ దాతలని ఎపిఎస్ ఆర్‌టిసి విజయనగరం ప్రజారవాణా అధికారి కె.శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ డిస్పెన్సరీలో రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా చివరి రోజున రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానంతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎపిఎస్ ఆర్టీసి విజయనగరం డిపో ఆర్‌టిఒ ఆదినారాయణ, సిఐ బి.ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

త్రైక్వాండోలో పతకాల పంట

ప్రజాశక్తి-బొబ్బిలి

గత నెల 29న గరివిడిలో జరిగిన త్రైక్వాండో పోటీల్లో బొబ్బిలి పట్టణానికి చెందిన క్రీడాకారులు పతకాల పంట పండించారు. సబ్‌జూనియర్, కేడెట్ జూనియర్స్ విభాగాల్లో పాల్గొని, బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. జిల్లా స్థాయిలో బొబ్బిలి రెండో స్థానంలో నిలిచిందని కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను గురువారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అభినందించారు.

సచివాలయ సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వేపాడ, బల్లంకి గ్రామ సచివాలయాల సిబ్బందికి ప్రభుత్వ పథకాలు, ఉద్యోగుల విధులపై గురువారం ఇఒపిఆర్‌డి సిహెచ్.సూర్యనారాయణ అవగాహన కల్పించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలతో స్నేహభావంతో మెలుగుతూ వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు ధనలక్ష్మి, నారాయణమూర్తి పాల్గొన్నారు.

గౌరమ్మవీధిలో తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-వేపాడ

వేపాడలోని గౌరమ్మవీధిలో తాగునీటి సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. సర్పంచ్ మెలిపాక అర్జునమ్మ రూ.2 లక్షలు నిధులు మంజూరు చేయడంతో తాగునీటి పైపులైను ద్వారా నీరందించారు. గురువారం కుళాయిలను ఎంపిపి డి.సత్య వంతుడు ప్రారంభించారు. ఎంపిపి, సర్పంచ్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి, వైసిపి నాయకులు మెలిపాక రమణ పాల్గొన్నారు.



కుళాయిని ప్రారంభిస్తున్న ఎంపిపి సత్యవంతుడు

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని కొట్యాడ పంచాయతీలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న రాడి ప్రసాద్‌కు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని సర్పంచ్ కొట్యాడ దేవిమహేష్ గురువారం అందజేశారు. కార్యక్రమంలో కొత్తవలస ఎఎంసి డైరెక్టర్ యర్ర శ్రీనివాసరావు, కొట్యాడ దేవుడు, కరెడ్ల దేవుడు , సచివాలయ కార్యదర్శి గోవింద పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న సర్పంచ్ దేవి మహేష్

హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-రామభద్రపురం

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని అవగాహన కల్పిస్తూ ఎస్ఐ సురేంద్రనాయుడు ఆధ్వర్యాన గురువారం రామభద్రపురంలో బైక్ ర్యాలీ చేపట్టారు. స్టేషన్ నుంచి మూడు రోడ్ల జంక్షన్ వరకు పోలీసు సిబ్బంది, యువత, విద్యార్థులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ హెల్మెట్ ధారణ వల్ల ప్రమాద తీవ్రత తగ్గడంతోపాటు సురక్షిత ప్రయాణానికి వీలుపడుతుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమని, లైసెన్స్ లేకుండా డ్రైవ్ చేస్తూ పట్టుబడితే కేసులు తప్పవని హెచ్చరించారు.

చింతపల్లిలో మన ఊరిలో జన వారధి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ప్రజా సమస్యలను తెలుసుకోవడానికే మన ఊరిలో జన వారధి కార్యక్రమం నిర్వహిస్తున్నామని జనసేన నియోజకవర్గ నాయకురాలు లోకం నాగమాధవి తెలిపారు. గురువారం మండలంలోని చింతపల్లిలో జనసేన ఆధ్వర్యంలో మన ఊరిలో జనవారధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మత్స్యకార మహిళలు తమ గోడును ఆమె ముందు వినిపించారు. జెట్టీ నిర్మిస్తే వలసలను నివారించవచ్చని తెలిపారు. 2019లో అగ్నిప్రమాదంలో 25 ఇళ్లు కాలి బూడిదయ్యాయని, ఇంతవరకూ పరిహారం అందలేదని బాధితులు వాపోయారు. అనంతరం ఆమె స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు జమ్మురాజు, కారి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.




చింతపల్లిలో పర్యటిస్తున్న జనసేన నాయకురాలు మాధవి, తదితరులు

సచివాలయ వ్యవస్థతో పంచాయతీల అభివృద్ధి

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-మెరకముడిదాం

సచివాలయ వ్యవస్థతో పంచాయతీల అభివృద్ధి జరుగుతోందని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బిల్లలవలసలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా వస్తున్న సంక్షేమ పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలుదగ్గర పడుతుండడంతో గ్రామాల్లోకి దొంగ పార్టీలు వస్తుంటాయని, జాగ్రత్తగా ఉండాలని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం ప్రజలకు ఏమీ చేయలేక పోవటంతో ప్రజల దగ్గరకు ఎలా వెళ్లాలో తెలియక మాయమాటలు చెబుతోందని అన్నారు. సుమారు రూ.5.75కోట్లతో ఈ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. గ్రామ సర్పంచ్ తిరుమలరాజు పాపాయమ్మ కోరికమేరకు గ్రామంలో కాలువల నిర్మాణానికి జెడ్‌పి నిధులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జిల్లా లోనే మెరక ముడిదాం మండల ప్రథమ స్థానంలో ఉందని అన్నారు. ఇంకా ఎక్కడైనా మిగిలి ఉంటే కొనటానికి అధికారులు సిద్ధంగా వున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి తాడ్డి కృష్ణవేణి, గ్రామ సర్పంచ్ పాపాయమ్మ, సర్పంచ్ ప్రతినిధి వర్మరాజు, వైసిపి నాయకులు ఎస్‌వి రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల మోతీలాల్ నాయుడు, కోట్ల వెంకటరావు, కెఎస్‌ఆర్‌ఎ ప్రసాద్, కర్రోతు నాగేశ్వరరావు, జి. మర్రి వలస సత్పంచ్ దేవ, పులిగుమ్మి సరఫంచ్ ప్రతినిధి తల చుట్ల ఈశ్వరరావు, గాతాడ సర్పంచ్ గిడిజాల సింహాచలం, మండల ఎంపిడిఒ పి.రామకృష్ణ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్ పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

వైసిపి వల్లే రాష్ట్రానికి అన్యాయం

మాజీమంత్రి పతివాడ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

వైసిపి ప్రభుత్వ అసమర్థత వల్లే కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారని మాజీమంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు తెలిపారు. గురువారం మండలంలోని రెల్లివలసలో తన నివాసం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో పోలవరం, రైల్వేజోన్, స్టీల్‌ప్లాంట్ ఊసెత్తకపోయినా వైసిపి పెద్దలు నోరుమెదపక పోవడం దారుణమన్నారు. కేవలం కేసులకు భయపడే ముఖ్యమంత్రి కిమ్మనడం లేదన్నారు. ఇలాంటి పాలకులతో ఎపికి తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. 30కి పైగా ఎంపిలు ఉండి కూడా బడ్జెట్‌లో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి కనీసం మాట్లాడకపోవడం బాధాకరమ న్నారు. టిడిపి నుంచి వెళ్లిన ముగ్గురు ఎంపిలు ప్రతిసారి ఎపికి చేస్తున్న అన్యాయంపై నిలదీయడం కనబడలేదా? అని నిలదీశారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకరరావు, నాయకులు పతివాడ అప్పలనాయుడు, పతివాడ తమ్మునాయుడు, టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు పతివాడ తారక్ రామానాయుడు, చందక ఆనందరావు, బ్రాహ్మణ సంఘం నాయకులు రాకేష్ శర్మ పాల్గొన్నారు.

పథకాల అమల్లో దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

ప్రజాశక్తి-గంట్యాడ

సంక్షేమ పథకాల అమల్లో రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. మండలంలో కొటారుబిల్లి జంక్షన్లో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నది, లేనిది తెలుసుకొని, అందరికీ అందేలా చూసేందుకు గృహసారథులు ఉపయోగపడతారని తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు ప్రతినిధిగా ఉండే సదావకాశం గృహ సారథులకు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి వర్రి నరసింహమూర్తి, ఎంపిపి హైమావతి, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు జైహింద్ కుమార్, ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

గృహ సారథులకు శిక్షణ

బొబ్బిలి : నియోజకవర్గంలో నూతనంగా నియమించిన గృహ సారథులకు శుక్రవారం నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. నియోజకవర్గంలో పట్టణ, మండలాల వారీగా జెసిఎస్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, గృహసారథులు, స్థానిక ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇస్తామన్నారు. శుక్రవారం తెర్లాం, శనివారం బాడంగి, ఆదివారం రామభద్రపురం, సోమవారం బొబ్బిలి మండలాల్లో, మంగళవారం బొబ్బిలి పట్టణంలో శిక్షణ ఇస్తామని వివరించారు.

20లోగా మాజీ సైనికులు ఇంటి పట్టా తేవాలి

డిఆర్‌ఒ ఎం.గణపతిరావు

ప్రజాశక్తి-విజయనగరం

గాజులరేగ సర్వే నంబరు 1లో ఇంటి స్థలాలకు పట్టాలు పొందిన మాజీ సైనికులు తమవద్దనున్న ఆధారాలను ఈ నెల 20వ తేదీలోపు విజయనగరం ఆర్‌డిఒకు సమర్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. ఈ సర్వే నెంబరులో 15 ఎకరాల కొండపోరంబోకు భూమిలో 352 మంది మాజీ సైనికులకు 2009లో అప్పటి తహశీల్దార్ ఇంటి పట్టాలు మంజూరు చేశారని తెలిపారు. దానిని సబ్ డివిజన్ చేసి తమకు అప్పగించాలని మాజీ సైనికుల సంక్షేమ సంఘం న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు చెప్పారు. అందువల్ల పట్టాలు పొందినవారంతా వ్యక్తిగతంగా హాజరై, తమ ఒరిజనల్ పట్టా, తాము మాజీ సైనిక ఉద్యోగులు లేదా వితంతువులని ధ్రువపరుస్తూ ఇతర ఆధారాలను, ఈ నెల 20వ తేదీలోగా ఆర్‌డిఒ కార్యాలయానికి సమర్పించాలని డిఆర్‌ఒ కోరారు.

సాంకేతిక అవగాహన ఉండాలి

డిఇఒ లింగేశ్వర రెడ్డి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిఇఒ లింగేశ్వర రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకుని, విద్యార్థులను చైతన్యం చేయాలని డిఇఒ బి.లింగేశ్వరరెడ్డి సూచించారు. స్థానిక్ ఫోర్ట్‌సిటీ స్కూల్లో గురువారం ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. జిల్లాలో 42 అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌ఛార్జి టీచర్లులు పాల్గొన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను పాఠశాలల్లో విజయవంతంగా నిర్వహించాలని డిఇఒ ఆదేశించారు. ప్రతి నెలా ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు చెప్పారు. రిసోర్సు పర్సన్‌గా వి.శమేష్, జిల్లా సైన్స్ అధికారి ఎం.కృష్ణారావు పాల్గొన్నారు. అనంతరం బాబామెట్టలో ఉన్న బాలికల హైస్కూల్‌కి వెళ్లి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి బోధన, మధ్యాహ్న భోజనం వంటివి పరిశీలించారు.

పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు

శృంగవరపుకోట : మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను గురువారం ఎంఇఒ పి.సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. నోటు పుస్తకాలు, వర్క్ బుక్‌లు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, సూచనలు చేశారు. పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. విద్యార్థుల భవిష్యత్తు తల్లిదండ్రుల చేతుల్లోనే ఉందని ఎంఇఒ తెలిపారు. రాబోయే రెండు నెలలు విద్యార్థులను బాగా చదివించాలని కోరారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సిబ్బందితో సమావేశమై పాఠశాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఇటీవల జిల్లా ఉత్తమ వార్డెన్‌గా ఎంపికైన ధర్మవరం హాస్టల్ వార్డెన్ సత్యనారాయణ రెడ్డిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.లక్ష్మి, సిఆర్‌పి సూర్యారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంగర : వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఇఒ వై.దుర్గారావు అన్నారు. మండలంలోని కొప్పరవలస ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశ్నలు వేసి, వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అనూష, సరోజినీ పాల్గొన్నారు.



ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపిపి

వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద గురువారం ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు, ఎంపిపి అంబళ్ల సుధారాణి వికలాంగులకు ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. ఎంఆర్‌సి, సమ్మిళిత విద్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వం వికలాంగులకు ఉచిత విద్య, వైద్యం అందించడంతోపాటు పరికరాలకు పంపిణీ చేస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ల శ్రీరాములు నాయుడు, డిసిసిబి వైస్ చైర్మన్ చనమల్ల వెంకట రమణ, వైస్ ఎంపిపి పతివాడ సత్యనారాయణ, ఎంపిడిఒ జి.గిరిబాల, తహశీల్దార్ కె.వి.రమణ రాజు, ఎంఇఒ అంబళ్ల కృష్ణారావు, ఐఇఆర్‌టి బెల్లాన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



గోడౌన్ పనులు పరిశీలిస్తున్న ఎంపిపి సురేష్ ముఖర్జీ

గోడౌన్ పనులు పరిశీలన

ప్రజాశక్తి-వంగర

వంగరలో చేపడుతున్న రైతు ఉత్పత్తిదారుల సంస్థ గోడౌన్ పనులను ఎంపిపి యు.సురేష్ ముఖర్జీ గురువారం పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలో 12.50 లక్షలతో కోల్డ్ స్టోరేజీ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి లోపింటి త్రినాథరావు, సచివాలయ ఉద్యోగులు ప్రసాద్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి గుర్ల

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని పల్లిగండ్రేడు కూడలి సమీపంలో గురువారం ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అచ్యుతాపురం నుండి పల్లిగండ్రేడు వైపు వస్తున్న రెండు బైక్‌లు అదుపుతప్పి ముందు వెళ్తున్న బైక్‌ను వెనక నుండి మరొకటి ఢీకొంది. దీంతో రోడ్డుపక్కన ఉన్న వాగులో పడిపోయాయి. ఈ ప్రమాదం లో గోషాఢ గ్రామానికి చెందిన దాసరి సూరప్పడు (35) అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెనుమాల ఆదినారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను విజయనగరం ఆస్పత్రికి తరలించారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. దాసరి సూరప్పడు గోషాడ నుంచి అత్తవారింటికి వచ్చాడు. పెనుమాల చింటూతో కలిసి బయటకు వెళ్లి తిరిగొస్తున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. సూరప్పడుకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గుర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.



మృతిచెందిన దాసరి సూరప్పడు




విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న బడ్డుకొండ ప్రదీప్, పాఠశాల ఆర్ఐ, ప్రినిపాల్

'శ్రీచైతన్య'లో స్పోర్ట్స్‌మీట్

ప్రజాశక్తి-విజయనగరం

రింగ్‌రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో గురువారం స్పోర్ట్స్‌మీట్ నిర్వహించారు. విద్యార్థులకు వివిధ క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పట్టణ సిఐ సిహెచ్ లక్ష్మణరావు, వైసిపి నాయకులు బడ్డుకొండ ప్రదీప్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల పర్యవేక్షణాధికారి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా ఉంటుందని అన్నారు.

ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తమ విద్యార్థులను క్రీడల్లో కూడా ప్రోత్సహించడం వల్ల ఉత్తమ ఫలితాలు వస్తున్నాయన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జగదీష్, డీన్లు సాయి కిశోర్, సత్యనారాయణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.





పరదేశమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న టిడిపి నాయకులు గొంప కృష్ణ, వెంకటరావు ; పోటీల్లో పాల్గొన్న ఎడ్లబండి

వైభవంగా పరదేశమ్మ జాతర

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట గ్రామంలో పరదేశమ్మ జాతర గురువారం వైభవంగా జరిగింది. పరదేశమ్మను టిడిపి నియోజకవర్గ నాయకులు గొంప కృష్ణ, మండల అధ్యక్షులు గొంప వెంకటరావు దర్శించుకున్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు గుమ్మడి భారతి, నాయకులు సేనాపతి గణేష్, మాజీ సర్పంచులు గొర్లె నాగరాజు, సిరికి రమణ, చెప్ప దేవుడు, తాడి కృష్ణ, సేనాపతి అప్పారావు, వై.సూర్యం, కోటాను అర్జున్‌రావు, కర్రి రాము, ఎన్.వెంకటరావు, బి.నారాయణమూర్తి, కోన గోవింద, డి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎడ్ల పరుగు పోటీలు

జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు పోటీలు ఆకట్టుకున్నాయి. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన వారికి డిసిసిబి చైర్మన్ వి.వి.చినరామునాయుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు గుమ్మడి భారతి గుమ్మడి భారతి, సర్పంచ్ ఎం.అర్జునమ్మ చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు.

దుర్గా పార్వతి ఆలయ వార్షికోత్సవం

మండలంలోని పాటూరులో దుర్గాపార్వతి అమ్మవారి ఆలయ 16వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. బి.హరిశర్మ ఆధ్వర్యాన పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గోగాడ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మండలంలోని సంతగౌరమ్మపేటకు చెందిన గోగాడ శ్రీనివాసరావు ఎంపికయ్యారు. దీంతో కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, జాతీయ ప్రధానకార్యదర్శి రాహుల్ గాంధీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.